manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 184 | శుక్రవారం | 20.12.2024


# పాలకుర్తి.. ఘనకీర్తి..

## తుది దశకు చేరుకున్న పర్యాటక ప్రాంత పనులు

### రూ.22 కోట్లతో బమ్మెర, పాలకుర్తి, వాల్మీడి అభివృద్ధి

జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలో రూ.22 కోట్లతో చేపట్టిన పర్యటకాభివృద్ధి పనులు తుది దశకు చేరాయి. ఇప్పటికే 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. వాల్మిడి, పాలకుర్తిలో పనులు వేగంగా పూర్తయిన.. బమ్మెర లో మాత్రం ఆగుతూ సాగుతున్నాయి.

- పాలకుర్తి, మన చౌరాస్తా

- వివరాలు 3 లో..





## దేవాదుల కోసం రూ.178 కోట్లు ఇవ్వండి

3

- అసెంబ్లీలో జనగామ ఎమ్మెల్యే పల్లా



## ఇన్ టైంలో సర్వే పూర్తి కావాలి

3

- అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్



## చిల్లర కేసులకు భయపడేది లేదు

2

- మాజీ మంత్రి కేటీఆర్

General News

# చిల్లర కేసులకు భయపడం

- ఓఆర్ఆర్ టెండర్ రద్దు చేసే దమ్ముందా
- రేవంత్ సర్కారుకు కేటీఆర్ సవాల్

**హైదరాబాద్, మన చౌరాస్తా:** ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి కేటీఆర్‌పై కేసు నమోదు కావడం.. తెలంగాణ రాజకీయాల్లో మంటలు పుట్టిస్తోంది. ఈ అంశంపై పాలక ప్రతిపక్షాలు ఎవరివాదన వారిదే అన్నట్టుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు క్లారిటీ ఇచ్చారు. ఎలక్ట్రిక్ వాహనాలకు హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే హైదరాబాద్‌లో ఫార్ములాఈ కార్ రేస్ నిర్వహించామని కేటీఆర్ వెల్లడించారు. ఫార్ములాఈ కారు రేస్ వ్యవహారంలో ఏసీబీ తనపై తప్పుడు కేసు నమోదు చేసినట్టు ఆరోపించారు.

2001లోనే హైదరాబాద్‌లో ఫార్ములా 1 రేస్ పెట్టాలని అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నించిందని కేటీఆర్ తెలిపారు. కానీ మారిన రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఫార్ములాఈ కార్ రేస్ నిర్వహించామని అన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు శాసనసభలో అనుమతించాలని స్పీకర్‌ను కోరామన్నారు. ఫార్ములాఈ కార్ అంశంపై చర్చించే సత్తా ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు. అక్రమాలు నిరూపించకుండా లీకులిస్తూ ఆరోపణలు చేస్తూ తప్పుడు కేసు పెడుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

హైదరాబాద్‌లో ఈ కార్ రేసింగ్ నిర్వహించడంపై సచిన్, ఆనంద్ మహీంద్రా వంటి ప్రముఖులతో పాటు బీజేపీ కేంద్ర మంత్రులు ప్రశంసించారని కేటీఆర్ గుర్తు చేశారు. కారు రేస్ నిర్వాహకులకు హెచ్ఎండీఏ రూ.55 కోట్లు చెల్లించిందని వెల్లడించిన కేటీఆర్, ఇది వాస్తవమని నిర్వాహకులు అంగీకరిస్తున్నారని, ఇందులో అవినీతి జరిగింది ఎక్కడో వివరణ ఇవ్వాలన్నారు. రేసింగ్ రద్దయినందున లైసెన్స్ ఫీజు రూ.74 లక్షలు వాపస్ తీసుకోవాలని ఎంఏఎంఎస్ఏ వాళ్లు లేఖ రాసినా ప్రభుత్వం స్పందించడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములాఈ కార్ రేసు కేసులో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొంటామని ఆయన తెలిపారు. రాజకీయ కేసు.. రాజకీయంగానే కొట్లాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. మరోవైపు, ఓఆర్ఆర్ టెండర్‌పై ప్రభుత్వం సిట్ విచారణకు ఆదేశించడంపై కేటీఆర్ స్పందించారు. దమ్ముంటే.. సీఎం రేవంత్ రెడ్డి ఓఆర్ఆర్ టెండర్ రద్దు చేయాలని కేటీఆర్ సవాల్ విసిరారు.



కేటీఆర్‌పై కేసు

గత బీఆర్ఎస్ హయంలో హైదరాబాద్ వేదికగా నిర్వహించిన ఫార్ములా ఈ కార్ రేసింగ్‌లో.. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది అవినీతి నిరోధక శాఖ. ఈ వ్యవహారంలో కేటీఆర్‌ను A1 ముద్దాయిగా నిర్ధారిస్తూ ఎఫ్ఐఆర్ సిద్ధం చేసింది. కేటీఆర్‌పై 13(1)A, 13(2) పీసీ యాక్ట్, 409, 120B వంటి నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు పెట్టింది. ఆర్‌బీఐ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఎస్ఈవో సంస్థకు నిధులు బదలాయించినట్టు ఏసీబీ ఆరోపించింది. భారతీయ కరెన్సీలో విదేశీ సంస్థకు నిధులు మళ్లించడాన్ని నేరంగా పరిగణించింది. కేబినెట్ అనుమతి, ఫైనాన్స్ సెక్రెటరీ క్లియరెన్స్ లేకుండా సొంత నిర్ణయంతో హెచ్ఎండీఏ బోర్డు నుంచి నిధులు మళ్లించారని కేటీఆర్‌పై అభియోగం మోపింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే.. ఈ చెల్లింపులు జరిగినట్టు ఎఫ్ఐఆర్‌లో స్పష్టం చేసింది. ఇక ఈ కార్ రేసింగ్ అంశంలో అప్పటి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్, మరో హెచ్ఎండీఏ అధికారిపై ఏసీబీ కేసు ఫైల్ చేసింది. ఇదిలా ఉండగా కేటీఆర్ గురువారం మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పెట్టిన చిల్లర కేసులకు భయపడమని స్పష్టం చేశారు.



## వర్గీకరణ అమలు చేయండి

**ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని ప్రముఖ డాక్టర్ సుగుణాకర్ రాజు కోరారు. ఈ మేరకు వర్గీకరణ ఏక సభ్య కమిషన్ హానరబుల్ జస్టిస్ డాక్టర్ షమీం అత్తర్‌కు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఒక వినతి పత్రాన్ని అందజేశారు. మాదిగ ఉపకులాలకు వర్గీకరణ చేసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ శాతాన్ని అమలు చేయాలని అందులో కోరారు. ఆయన వెంటన జనగామ ఎస్సీ నాయకుడు మల్లిగారి రాజు తదితరులు ఉన్నారు.**

**- మన చౌరాస్తా, జనగామ**

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**బచ్చన్నపేట, మన చౌరాస్తా:** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన బచ్చన్నపేట మండలం గోపాల్‌నగర్ వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నక్కవానిగూడెంకు చెందిన గుంటిపల్లి యాదగిరి తన బైక్‌పై గురువారం సాయంత్రం సొంత పని మీద చిన్న రామంచర్ల వైపు వెళ్తున్నాడు. బచ్చన్నపేటకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కేజీబీల్స్ వేసుకొని అతివేగంగా వచ్చి యాదగిరిని ఢీకొట్టడంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హమీద్ తెలిపారు.



## బోథ్ బస్టాండ్ పరిరక్షణకు కృషి

**బోథ్, మన చౌరాస్తా:** అన్యాక్రాంతమవుతున్న బోథ్ బస్టాండ్ పరిసరాలను, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని వాటిని రక్షించడానికి చర్యలు చేపడుతున్నామని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో బస్టాండ్ ప్రహరీ లేకపోవడం, ప్రయాణికులకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని, వాటిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే బస్టాండ్ డిజిటల్ మ్యాప్ ఆధారంగా ప్రహరి కోసం కొలతలు సేకరించారు. బస్టాండ్ లో రాత్రి సమయంలో ఇబ్బందిగా ఉందని లైటింగ్, మంచినీరు, పశువులు రాకుండా ఉండేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, విడిసి చైర్మన్ గట్ల గంగాధర్ పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యాలతో ఆటలా..!

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ జిల్లా కేంద్రంలో సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ స్కూల్ల పేరుతో లక్షలలో ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్ నాయకుడు మంగళంపల్లి రాజు ఆరోపించారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు పాఠశాలలు మూత్రశాలలు సరిగా లేవని, స్కూల్ అంతా అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. క్రీడా స్థలాల్లో ముళ్లచెట్లు నిండిపోయాయని పేర్కొన్నారు. ఇలాంటి పాఠశాలలపై డీఈవో వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఎస్ఎఫ్ నాయకులు బిట్ల చిన్న, వికాస్, లక్ష్మణ్, అరుణ్, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## 28 నుంచి 31 వరకు ఏపీజీవీబీ సేవలకు బ్రేక్

**జనగామ, మన చౌరాస్తా:** వరంగల్ కేంద్రంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పలు జిల్లాల్లో సేవలందిస్తున్న ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ)కు సంబంధించి తెలంగాణలోని బ్రాంచులన్నీ తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ)లో విలీనం కానున్నట్లు ఆ బ్యాంకుల రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపినట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1నుంచి తెలంగాణలోని ఏపీజీవీబీ బ్రాంచులన్నీ తెలంగాణ గ్రామీణ బ్యాంకు పేరుతోనే సేవలందించనున్నాయన్నారు. ఇందుకోసం ఏపీజీవీబీ బ్యాంకు బోర్డులను తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారబోతుందన్నారు. ఈ మార్పుల నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31వరకు తెలంగాణలో ఏపీజీవీబీ సేవలు నిలిచిపోనున్నాయని, ఏటీఎంలు, ఆన్‌లైన్ నగదు లావాదేవీలతో పాటు ఇతర బ్యాంకు కార్యకలాపాలు పూర్తిగా స్తంభించనున్నాయన్నారు. ఇప్పటి వరకు కొన్ని జిల్లాలకే పరిమితమైన ఈ బ్యాంకు బ్రాంచులను తెలంగాణ రాష్ట్రమంతా విస్తరింపజేయనున్నట్లు ఎల్‌డీఎం పేర్కొన్నారు.

Local News



# పాలకుర్తిని చూసొద్దామా!

- తుది దశకు చేరుకున్న పర్యాటక ప్రాంత పనులు
- రూ.22 కోట్లతో బమ్మెర, పాలకుర్తి, వాల్మీడి అభివృద్ధి

**పాలకుర్తి , మన చౌరాస్తా :**


జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలో రూ.22 కోట్లతో చేపట్టిన పర్యటకాభివృద్ధి పనులు తుది దశకు చేరాయి. ఇప్పటికే 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. వాల్మిడి, పాలకుర్తిలో పనులు వేగంగా పూర్తయిన.. బమ్మెర లో మాత్రం ఆగుతూ సాగుతున్నాయి. చారిత్రక బావి , సమాధిని పూర్తిస్థాయిలో బాగు చేయగ.. ఆడిటోరియం , అక్షరాభ్యాస కేంద్రం, విడిది, స్మారక కేంద్రాల పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. మహాకవి పోతన విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమహేంద్రవరంలో తయారు చేస్తున్నారు. ప్రముఖ శిల్పి వడియార్ రాజ్ కుమార్ అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ కాంక్ష విగ్రహాన్ని రెండున్నర కోట్లతో రూపొందిస్తున్నారు. మరో నెల రోజుల్లో ఏర్పాటు చేసే దిశగా అధికారులు, పాలకులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే మామిడాల యశశ్విని రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ భాష అభివృద్ధి కమిటీ సభ్యులతో పలుమార్లు సమావేశం నిర్వహించి. వేగంగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. 2017 లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా బమ్మెరకు వచ్చి అభివృద్ధి నిధులు ప్రకటించారు. తదనంతరం పనులు ముందుకు సాగాయి.





## పర్యాటక అభివృద్ధి క్యారిడార్ ఇలా..

ఇప్పటికే వల్మిడి గుట్టపై నూతన రామాలయం పూర్తయింది. ఏడాది కింద అప్పటి పాలకులు, అధికారులు లాంఛనంగా ప్రారంభించి నాలుగు రోజులపాటు ఉత్సవాలు కూడా నిర్వహించారు. పాలకుర్తిలో సోమేశ్వరాలయ అభివృద్ధి, శీతల కళ్యాణమండపం, పాలకుర్తి సోమనాదుని స్మారక కేంద్రాలను సుందరంగా తీర్చిదిద్దారు. 13 అడుగుల రాతి విగ్రహాన్ని సైతం స్థూపం అంచున స్మారక కేంద్రంలో ఏర్పాటు చేశారు. దీంతో పాలకుర్తికి కొత్త శోభ రాగ , పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో నలుమూలల నుంచి పర్యాటకులు, భక్తులు, సాహితీవేత్తలు తరచూ సందర్శిస్తున్నారు. ఈ ప్రాంత చరిత్రతో పాటు మహాకవుల పేర్లను తలుచుకుంటూ ప్రశంసిస్తున్నారు. చారిత్రక ప్రాంత అభివృద్ధిని మరువలేమంటూ వారు కొనియాడుతున్నారు.



## ఎంతో గర్వించదగ్గ విషయం



చారిత్రక ప్రాంతాలను అభివృద్ధి చేయడం ఎంతో గర్వించదగ్గ విషయం. గతంతో పోలిస్తే పర్యాటకులు, భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. సోమేశ్వరాలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. ఈ ప్రాంత చరిత్రను తెలుసుకోవడానికి ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన భక్తులు ఆరాట పడుతుంటారు. సోమేశ్వరాలయంలో అర్చకుడిగా పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. - దేవగిరి అనిల్ శర్మ , అర్చకులు

# దేవాదుల కోసం రూ.178 కోట్లు ఇవ్వండి

- జనగామ నియోజకవర్గం సస్యశ్యామలమవుతుంది
- అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**జనగామ, మన చౌరాస్తా :** దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పనుల కోసం రూ.178 కోట్లు కేటాయించాలని, 499 ఎకరాలకు మీరు ప్రొక్యూర్ చేసినట్లయితే మాతో పాటు కింద ఉన్న ఆలేరుకు పూర్తిగా నీళ్లు వస్తాయని.. ఇది మంజూరై ఉన్న ప్రాజెక్టేనని.. వెంటనే రిలీజ్ చేసి పనులు ప్రారంభించాలని జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అసెంబ్లీలో జనగామ ఎమ్మెల్యే పల్లా స్పీకర్ ద్వారా మంత్రికి ఈ విషయాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ 'తపాస్ పల్లి రిజర్వాయర్ 4 మోటర్లు అన్ చేసి చెరువులు నింపాలని నియోజకవర్గ ప్రజల తరపున చేతులు విజ్ఞప్తి చేస్తున్నా.. ఇంతకుముందు ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన భువనగిరి పార్లమెంట్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేసి ఏమి రిక్వైర్మెంట్స్ ఉన్నాయో మమ్మల్ని అడిగారు. ఆనాడే వారికి సమస్యలను తెలియచేసాను.. జనగామ నియోజకవర్గంలోనే దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ఎక్కువ భాగం ఉంటుంది. మంత్రికి మిగిలిపోయినా ప్యాకేజి ఎనిమిదిలో, ప్యాకేజీ ఏడులో, ప్యాకేజీ రెండులో సంబంధించి కొద్దిగా భూమి దారి దాపుగా 3400 ఎకరాల్లో 2972 ఎకరాలు ఆల్రెడీ ప్రొక్యూర్ చేశారు. 430 ప్యాకేజి 8 లో ఉన్నది. ప్యాకేజి 7లో 36 ఎకరాలు, ప్యాకేజీ 2లో 33 మొత్తంగా చూస్తే 499 ఎకరాలు మనం ప్రొక్యూర్ చేసుకోవాలి. దీనికి సంబంధించిన రూ.178 కోట్లు కావాలి. ఇవి కేటాయించినట్లయితే మాకు, మా కింద ఆలేరు సంబంధించిన వాళ్లకు కూడా బాగుటుంది. ఇటీవల ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మా తపాస్‌పల్లి ఓపెన్ చేసి మొత్తం నీళ్లు తీసుకుపోయారు. మా నియోజకవర్గంలో దాదాపు 484 చెరువులు ఉంటాయి. ఆ చెరువులు పూర్తిగా నిండాలంటే కొద్దిగా భూసేకరణతో పాటు నిధులు ఇచ్చినట్లయితే మాకు, ఆలేరు సంబంధించిన పైన 2 మండలాల్లో కూడా నీళ్లు కలిపి తీసుకోవొచ్చు. మాకు పూర్తిగా నిండకుండా వాళ్లు నీళ్లు తీసుకపోయేసరికి మాకు ఘర్షణ వైఖరి వస్తుంది.. దయచేసి 499 ఎకరాలకు సంబంధించిన రూ.178 కోట్లు కేటాయించినట్లయితే మిగిలిన కాలువలు చేసుకుంటాం..' అని పల్లా వివరించారు.

# ఇన్ టైంలో సర్వేను పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్



**జనగామ, మన చౌరాస్తా :** ఇందరమ్మ ఇండ్ల సర్వేను ఇన్‌టైంలో పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలోని శామీర్పేట్ , బచ్చన్నపేట మండలంలోని తమ్మడపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు చేస్తోన్న సర్వే సరళిని పరిశీలిస్తూ క్రమబద్ధతతో పని చేయాలని ఆదేశించారు. అదే విధంగా తానే స్వయంగా దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి, సొంత స్థలం కలిగి ఉన్నారా? నివేశన స్థలానికి సంబంధించి ఏమైనా ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా? అని తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారి సొంత ఇంటి కలను నిజం చేసేందుకు గాను చేపట్టిన ఈ సర్వేను సజావుగా నిర్వహించాలని సూచించారు. నిర్దేశిత సమయంలోగా ఈ సర్వే ప్రక్రియను పూర్తిచేయాలని తెలిపారు. పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ ప్రకాష్‌రావు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.




# వెంకీ మామ మరో సాంగ్ వచ్చేసింది

విక్టరీ వెంకటేశ్, యంగ్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో తెరకెక్కిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఫ్యామిలీ, క్రైమ్ కామెడీ నేపథ్యంలో రూపొందించిన ఈ సినిమా సంక్రాంతికి విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మూవీ మేకర్స్ ప్రమోషన్స్ జోరు పెంచారు. ఇందులో భాగంగా ఒక్కో పాటను విడుదల చేస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన గోదారిగట్టు మీద.. అనే సాంగ్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మీనూ.. అనే సెకండ్ సాంగ్ ను విడుదల చేశారు మేకర్స్. మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో పాడిన ఈ సాంగ్.. ఆకట్టుకుంటోంది. దిల్ రాజ్, సిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాలో ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. జనవరి 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# Varsha Digitals

మీ పుట్టిన రోజు, పెళ్లిరోజుల శుభాకాంక్షలు.. నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డ్స్ మరియు క్యాలెండర్లను ఆకర్శనీయంగా డిజైనింగ్ చేయబడును..

వివరాలకు ఈ కింది నంబర్లను సంప్రదించండి.

**8555 800 812**

**9676 400 812**

